
సాక్షి
పల్నాడు
మంగళవారం । 7 । అక్టోబర్ । 2025



సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

నరసరావుపేట: విద్యుత్ ఉద్యోగులు ఈనెల 15 నుంచి జరపతలపెట్టిన నిరవధిక సమ్మె పోస్టర్‌ను సోమవారం స్థానిక ఈఈ కార్యాలయంలో ఆవిష్కరించారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 37,511 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 32,511 క్యూసెక్కులు వదులుతున్నారు.



భక్తిశ్రద్ధలతో చండీహోమం

నగరంపాలెం: బృందావన్‌గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యాన సోమవారం చండీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

సర్కారు మొండివైఖరి ఫలితం

పడకేసిన పల్లె వైద్యం

జిల్లాలో పీహెచ్‌సీల వైద్యుల ఆందోళన ఉధృతం

- ప్రభుత్వం దిగివచ్చే వరకు వెనక్కి తగ్గేది లేదంటున్న వైద్యులు
- గ్రామీణ ప్రాంత ప్రజలకు లభించని వైద్య సేవలు
- 11వ రోజుకు చేరిన పీహెచ్‌సీ వైద్యుల ఆందోళన
- చోద్యం చూస్తున్న కూటమి పాలకులు



ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు లేకపోవడంతో మందులు మాత్రం తీసుకుంటున్న రోగులు

సత్తెనపల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైద్య రంగాన్ని నిర్వీర్యం చేసింది. పీహెచ్‌సీలో పనిచేస్తున్న వైద్యుల సమస్యలను పట్టించుకోకపోవడంతో గత నెల 26 నుంచి వైద్యులు సమ్మెబాట పట్టారు. దీంతో జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలలో వైద్య సేవలు స్తంభించిపోయాయి. తొలుత జిల్లాలోని పీహెచ్‌సీల్లో ఓపీ సేవలు నిలిపివేశారు. అత్యవసర సేవలు మాత్రమే అక్కడక్కడ కొనసాగాయి. నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారు. ఆన్‌లైన్ సేవలు, రిపోర్టులు సమర్పణకు బంద్ పాటించారు. అనంతరం నిరవధిక నిరసనలో భాగంగా జిల్లా కేంద్రాల్లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయాల వద్ద నిరసన చేపట్టారు. ప్రస్తుతం విజయవాడలో పీహెచ్‌సీల వైద్యులు నిరసన చేపడుతున్నారు.

జిల్లావ్యాప్తంగా సేవలు అంతంతే...

ఆంధ్రప్రదేశ్ పీహెచ్‌సీ వైద్యుల సంఘం పిలుపు మేరకు వైద్యులు సమ్మెబాట పట్టారు. దీంతో జిల్లా వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీల్లో వైద్యసేవలు స్తంభించిపోయాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి పీహెచ్‌సీలకు విచ్చేసిన రోగులు వైద్యులు లేకపోవడంతో వెనుదిరుగుతున్నారు. పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న నర్సులు సైతం డాక్టర్లు లేరని తామేమీ చేయలేమని చేతులెత్తేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీలలో వైద్యులు తమ సమస్యలను పరిష్కరించాలంటూ సమ్మెకు దిగడంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 39 పీహెచ్‌సీలు ఉండగా 110 మంది వైద్యులు సేవలందిస్తుండేవారు. ఒక్కో పీహెచ్‌సీలో ఇరువురు వైద్యులు వైద్య సేవలు అందించేవారు. ప్రస్తుతం వైద్యుల సమ్మె కారణంగా అర్బన్ పీహెచ్‌సీలు, మెడికల్ కళాశాల విద్యార్థులతో ఒక్కో పీహెచ్‌సీలో ఒక వైద్యున్ని ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేశారు.



ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

'104' పై ప్రభావం



జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు సమ్మెబాట పట్టడంతో 104 వైద్య సేవలపై ఆ ప్రభావం కనిపించింది. పీహెచ్‌సీల్లో ఇద్దరు వైద్యులు ఉండగా ఒకరు ఆరోగ్య కేంద్రంలో, మరొకరు 104 సంచార వైద్య సేవల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించాల్సి ఉంటుంది. గతంలో 104 వాహనంలో పనిచేసే వైద్యులు నిరసన వ్యక్తం చేసినప్పుడు వారి సమస్యలు పరిష్కరిస్తామని అప్పట్లో కూటమి నేతలు, ఉన్నతాధికారులు హామీ ఇచ్చారు. తీరా నిరసన విరమించాక ఏమాత్రం పట్టించుకోలేదు. చంద్రన్న సంచార చికిత్స వాహనంలో తిరిగి సేవలందిస్తున్నందుకు ప్రతి నెల అదనంగా రూ. 5 వేలు చెల్లించాలని వైద్యులు కోరుతున్నారు. అవి అందించకపోవడంతో 104 వైద్య సేవలు ఆగిపోయాయి. వైద్యులు లేకపోవడంతో సిబ్బంది కేవలం మందుల పంపిణీ మాత్రమే చేపడుతున్నారు.

వైద్యుల డిమాండ్లు ఇవీ...

- సర్వీసులో ఉన్న మెడికల్ ఆఫీసర్లకు గతంలో 30 శాతం క్లినికల్, 50 శాతం నాన్ క్లినికల్ రిజర్వేషన్ ఉండేది. ప్రస్తుతం ఈ కోటాను 15, 30 శాతానికి కుదించారు.
- ఈ ఏడాది జీఓ నెంబర్ 89 ద్వారా ఆరు బ్రాంచ్‌ల నిబంధన తెరమీదకు తెచ్చారు. దీని ప్రకారం 15 శాతానికి కుదించిన క్లినికల్ సీట్ల రిజర్వేషన్ రేడియాలజీ, మెడిసిన్, సర్జరీ, పీడియాట్రిక్స్, గైనకాలజీ, అనస్తీషియా బ్రాంచీలకు మాత్రమే వర్తింపజేసింది. ఈ అన్యాయాన్ని వైద్యులు ఏడాది కాలంగా ప్రశ్నిస్తున్నా ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదు.
- ఎంబీబీఎస్ చదివి వైద్యాధికారిగా నియమితులైన వారు పీజీ చదువుకోవడానికి ప్రభుత్వం అనేక షరతులు పెట్టింది. రూ. 50 లక్షలు ష్యూరిటీ ఇవ్వాలని, కనీసం పదేళ్ల ప్రభుత్వ సర్వీసులో అదే హోదాలో పనిచేస్తామంటూ బాండ్ రాయాలని చెబుతోంది.
- మెడిసిన్ చదివినా ఒరిజినల్ సర్టిఫికెట్లు కూడా ప్రభుత్వం తన వద్ద హామీగా పెట్టుకుంటోంది. దీంతో వైద్య వృత్తిలో ఎదుగుదల లేదని, ఇంక పీజీ చదవటం దేనికని పీహెచ్‌సీల వైద్యులు ప్రశ్నిస్తున్నారు.
- డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలో పనిచేస్తున్న ఎంతోమంది వైద్యాధికారులకు 20 ఏళ్లుగా పదోన్నతులు లేవు. వారికి పదోన్నతులు కల్పిస్తామని ఎన్నికల వేళ అసోసియేషన్ నాయకులకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కింది. ఇప్పుడు ఆ విషయం ప్రస్తావిస్తే కక్ష సాధింపు చర్యలకు పూనుకుంటోందని వైద్యులు ఆరోపిస్తున్నారు.

న్యూస్‌రీల్

బోధనా నైపుణ్యాలు పెంచుకోవాలి

డీఈఓ చంద్రకళ



నరసరావుపేట ఈస్ట్: మెగా డీఎస్సీ–2025 ద్వారా ఉపాధ్యాయులుగా నియామకం పొందినవారు బోధనా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. ఉపాధ్యాయులుగా నియామకం పొందినవారికి అందిస్తున్న శిక్షణా తరగతులను సోమవారం డీఈఓ చంద్రకళ సందర్శించి తరగతుల నిర్వహణ తీరును పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు తమ తమ పాఠశాలల్లోని విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలని హితవు పలికారు. పల్నాడుజిల్లా విద్యాశాఖ ఏడీ బి.వి. రమణ, శిక్షణ కేంద్రాం ఇన్‌చార్జి సత్యనారాయణసింగ్, ఏఎంఓ పూర్ణచంద్రరావు, రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

నేటి 'చలో విజయవాడ'కు వైఎస్సార్ టీప మద్దతు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం విజయవాడలోని ధర్నా చౌక్‌లో ఫ్యాప్టో తలపెట్టిన మహాధర్నాకు వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ (వైఎస్సార్‌టీఏ) మద్దతు తెలుపుతున్నట్లు సంఘం రాష్ట్ర నాయకుడు చందోలు రవికుమార్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని, బోధనేతర కార్యక్రమాలను వారికి అప్పగించవద్దని ఎన్ని విజ్ఞప్తులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. 12వ పీఆర్సీ, మధ్యంతర భృతి మంజూరు, పాత పెన్షన్ విధానం, ఆర్థిక బకాయిల చెల్లింపు, పెన్షనర్లకు కార్పొరేషన్ ఏర్పాటు వంటి హామీలు ఇచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చి 16 నెలలు అయినా నెరవేర్చ లేదని తెలిపారు.

ఏఎన్‌యూలో ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్ ఫలితాల విడుదల

పెదకాకాని (ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్, న్యూట్రిషన్ డైటాటిక్స్ కోర్స్ రెండవ సెమిస్టర్ ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాద్‌రావు సోమవారం విడుదల చేశారు. ఈ కోర్సులో 73 మంది పరీక్షలు రాయిగా, 64 మంది ఉత్తీర్ణత సాధించారని ఆయన పేర్కొన్నారు. రీవాల్యుయేషన్‌కు ఈ నెల 15వ తేదీలోగా ఒక్కో పేపర్‌కు రూ.1,860 చెల్లించాలని సూచించారు.

యోగా కోర్సుల్లో ప్రవేశాలు

అలాగే వ్యాయామ కళాశాలలో పీజీ డిప్లొమా ఇన్ యోగా ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్ (సంవత్సరం), ఎమ్మెస్సీ ఇన్ యోగా ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్ (రెండు సంవత్సరాలు), ఎంఎస్సీ యోగా లేట్రల్ ఎంట్రీ కోర్సులకు కౌన్సెలింగ్ పూర్తి అయిన తర్వాత మిగిలి ఉన్న సీట్లకు వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో ఈ నెల 7 నుంచి 20 వ తేదీ వరకు అడ్మిషన్లు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్ తెలిపారు. పీజీ డిప్లొమా, ఎమ్మెస్సీ కోర్సులలో చేరటానికి డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంఎస్సీ యోగా లేటరల్ ఎంట్రీ కోర్సులో చేరటానికి విశ్వవిద్యాలయంలో పీజీ డిప్లొమా ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. వివరాలకు 73964 58123, 97030 00795 ఫోను నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పశ్చిమ డెల్టాకు 7,713 క్యూసెక్కులు విడుదల

దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి 7,713 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజ్ వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్‌కి 306 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 1,888, తూర్పు కాలువకు 620, పశ్చిమ కాలువకు 225, నిజాపట్నం కాలువకు 435, కొమ్మూరు కాలువకు 3,300 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. బ్యారేజ్ నుంచి సముద్రంలోకి 50,025 క్యూసెక్కుల వదులుతున్నారు.

అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యం

- జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా
- పీజీఆర్ఎస్‌లో 149 అర్జీలు స్వీకరణ



నరసరావుపేట: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ ద్వారా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలపై కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, జిల్లా అధికారులకు 149 అర్జీలు అందజేశారు. పీజీఆర్ఎస్ ఇన్‌చార్జి, పులిచింతల ప్రాజెక్ట్ ప్రత్యేక కలెక్టర్ బి.గాయత్రీదేవి, డీఆర్ఓ ఎ.మురళి, జిల్లా అధికారులు భానుకీర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

కల్వర్టు ఏర్పాటు చేయరూ..

గుండ్లపల్లి గ్రామంలో రెండో సచివాలయ పరిధిలో ఏడువేలమంది జనాభా ఉండగా అందులో నాతో పాటు అనేకమంది దివ్యాంగులు, వృద్ధులు ఉన్నారు. సచివాలయంలోకి వెళ్లేదారిలో డ్రైనేజ్ కాలువ అడ్డంగా ఉంది. అది దాటేందుకు తగిన మార్గంలేదు. ఇబ్బందులు పడుతున్నాం. కల్వర్టు ఏర్పాటుచేసి ఇబ్బందులు తీర్చండి.

–సీహెచ్ అల్బునాబీ, దివ్యాంగుడు, గుండ్లపల్లి, నకరికల్లు మండలం

మూడోసారి అర్జీ..

నేను కొనుగోలు చేసిన రెండుసెంట్ల భూమికి సంబంధించిన పత్రాలను నా అల్లుడు దాచిపెట్టాడు. అడిగితే నీకెటువంటి హక్కులేదని ఇంట్లో నుంచి బయటకు గెంటాడు. 77ఏళ్ల వయస్సులో ఒంటరిగా ఉంటున్నా. నా బతుకుదెరువుకోసం ఆ స్థలాన్ని అమ్ముకోవాలని అనుకుంటున్నా. ఆ కాగితాలను ఇప్పించి నాకు న్యాయం చేయండి. ఇప్పటికే రెండుసార్లు అర్జీలు అందజేశాను. పట్టించుకోలేదు.

–దేవళ్ల శ్రీనివాసరావు, గుడిపూడి, సత్తెనపల్లి మండలం

జిల్లా స్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డులు గర్వకారణం

16 విభాగాల్లో 51 మంది వ్యక్తులు, సంస్థలకు అవార్డులు అందజేసిన కలెక్టర్ కృతికా శుక్లా



అవార్డు ప్రదానం చేస్తున్న జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్, అధికారులు

నరసరావుపేట: జిల్లా స్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డుల కార్యక్రమం నిర్వహించుకోవడం ఎంతో గర్వకారణంగా ఉందని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం భువనచంద్ర టౌన్ హాలులో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థచైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావుతో కలిసి మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 527 గ్రామ పంచాయతీలు, ఆరు పట్టణ స్థానిక సంస్థలు, రెండు నగర పంచాయతీలు ఉన్నాయని, స్థానిక సంస్థల్లో డోర్ టు డోర్ కలెక్షన్ 93శాతం జరుగుతుందన్నారు. అందులో 42శాతం చెత్తసేకరణ జరిగిన చోటనే తడి, పొడి చెత్తగా వేరు చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో 100 శాతం ఇంటి వద్దే వేస్ట్ కలెక్షన్, సెగ్రేషన్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్వచ్ఛతా కార్యకలాపాలపై చేసిన కృషిని గుర్తించి ప్రభుత్వం అవార్డులను ఏర్పాటు చేసిందన్నారు. స్వచ్ఛ నగర, మండలాలు, స్వచ్ఛ గ్రామ పంచాయతీలు, స్వచ్ఛ పాఠశాలలు, స్వచ్ఛ ఆసుపత్రులు, స్వచ్ఛ కార్యాలయాలు, స్వచ్ఛ రైతు బజార్లు, స్వచ్ఛ బస్‌స్టేషన్లు, స్వచ్ఛ పరిశ్రమలు మొదలైన వివిధ విభాగాలలో అవార్డులకు ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, బహిరంగ ప్రదేశాలలో శుభ్రత, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, మొత్తం 17 కేటగిరీలలో అవార్డులు ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర స్థాయిలో అవార్డుకు ఎంపికైన దళిత బహుజన రిసోర్స్ సెంటర్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలాగే జిల్లా స్థాయిలో 16 విభాగాల్లో 51 మంది వ్యక్తులు, సంస్థలకు అవార్డులు ప్రదానం చేశామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల పేరుతో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛతా అవార్డులను ప్రకటిస్తోందని, అదేబాటలో స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు అభినందనీయమన్నారు. పంచాయతీ అధికారులు, మున్సిపల్ కమిషనర్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 588.00 అడుగులకు చేరింది. ఇది 306.1010 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 10,040, ఎడమకాలువకు 9,076, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 33,211, ఎస్ఎల్‌బీసీకి 1,800, వరదకాలువకు 300 క్యూసెక్కులు విడుదలవుతోంది. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 54,427 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 54,427 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

సహకార సంఘాల్లో యూరియా గోల్‌మాల్



తాడికొండ: కో ఆపరేటివ్ సొసైటీల్లో యూరియా గోల్‌మాల్ జరుగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా అధికార పార్టీకి చెందిన నాయకులు, ప్రైవేటు వ్యాపారులు అందినకాడికి దోచుకుంటున్నారు. దీనిపై సంబంధిత వ్యవసాయ శాఖాధికారుల నిఘా కొరవడటంతో సామాన్యుడికి యూరియా అందని ద్రాక్షగా మారింది. సోమవారం తాడికొండ మండలం పొన్నెకల్లు సొసైటీకి చెందిన ఎరువుల లారీ నిబంధనలకు విరుద్ధంగా అడ్డరోడ్డు కూడలిలో ట్రాక్టర్‌కు లోడింగ్ చేస్తుండగా 'సాక్షి'కి చిక్కారు. ఈ క్రమంలో కూలీలు ముఖం దాచుకొని కిందకి దిగి డోర్లు వేయగా... లారీ, ట్రాక్టర్లతో డ్రైవర్లు తలో దిక్కుకు వెళ్లిపోయారు. సొసైటీకి చెందిన యూరియా బస్తాలు ఎవరికి ఇస్తున్నారు? రోడ్డుపై ఎందుకు ఇలా దించుతున్నారు? అని ప్రశ్నించగా ఎవరికి వారే నీళ్ల నములుతూ ముఖం చాటేశారు. రైతులకు సక్రమంగా సరఫరా చేయాల్సిన వ్యవసాయ శాఖ కనీస నిబంధనలకు కూడా నీళ్లొదిలింది. అన్ని సొసైటీల్లోనూ సరుకు తప్పుదారి పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

పులిచింతలకు 32,741 క్యూసెక్కులు విడుదల



సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద నున్న నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ 3 క్రస్ట్‌గేట్లు, రెండు యూనిట్లు ద్వారా విద్యుత్ ఉత్పాదన అనంతరం మొత్తం 32,741 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఎస్‌ఈ వెంకటరమణ, ఈఈ సుబ్రమణ్యం సోమవారం తెలిపారు. టెయిల్‌పాండ్ ప్రాజెక్టు రిజర్వాయర్ 2 క్రస్ట్‌గేట్లు 1.5 మీటర్లు, మరో క్రస్ట్‌గేటు 2 మీటర్లు ఎత్తు ఎత్తి 24,116 క్యూసెక్కులు, రెండు యూనిట్ల ద్వారా విద్యుత్పాదన అనంతరం 8,625 క్యూసెక్కులు మొత్తం 32,741 క్యూసెక్కుల వరదనీటిని దిగువనున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. నీటిమట్టం ప్రాజెక్టు 75.50 మీటర్లకు గాను 75.50 మీటర్లకు నీరు చేరుకుందన్నారు. రిజర్వాయర్ గరిష్ట నీటి సామర్థ్యం 7.080 టీఎంసీలకు గాను ప్రస్తుతం 7.080 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. టీఆర్‌సీ లెవల్ 55.91 మీటర్లకు చేరుకుందన్నారు. ప్రస్తుతం నాగార్జునసాగర్ నుంచి ప్రస్తుతం 33,211 క్యూసెక్కులు వస్తుందని వచ్చే వరదను బట్టి దిగువనున్న పులిచింతలకు నీటిని విడుదల చేస్తామన్నారు.

ఖతార్‌లో నర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఖతార్ దేశంలోని దోహాలో రిజిస్టర్డ్ నర్సుల ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ జీఎన్ఎం నర్సింగ్ పూర్తిచేసి రెండు సంవత్సరాల అనుభవం కలిగి 21 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల మహిళా, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులకు ఈనెల 13వ తేదీన విజయవాడ రమేష్ హాస్పటల్ రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలోని ఓఎంసీఏపీ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు రోజుకు 12గంటలు, వారానికి 6 రోజులు పనిదినాలు, ఏడాదికి 20 రోజులు సెలవులు ఉంటాయన్నారు. నెలకు సుమారు రూ1.2లక్షలు వేతనం లభిస్తుందని తెలిపారు. అభ్యర్థులు 2 సంవత్సరాల ఒప్పంద కాలానికి పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9988853335, 8712655686, 8790118349 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

చేనేత రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

- చేనేత రంగ పరిరక్షణకు సమగ్ర విధానం ప్రకటించాలి
- ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలో మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

సత్తెనపల్లి: చేనేత రంగాన్ని నిర్వీర్యం చేస్తూ పెట్టుబడిదారులకు ప్రభుత్వాలు పెద్ద పీట వేస్తున్నాయని, చేనేత రంగ పరిరక్షణకై సమగ్ర విధానాన్ని ప్రకటించాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో సోమవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం 11వ రాష్ట్ర మహాసభల ప్రారంభ సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సభకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టా శివ దుర్గ రావు అధ్యక్షత వహించారు. ముందుగా మహాసభల ప్రాంగణం ముందు సంఘం జెండాను చేనేత కార్మిక సంఘం సీనియర్ నాయకులు అనంత పిచ్చయ్య ఆవిష్కరించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ భారతదేశంలో వ్యవసాయ రంగం తర్వాత అత్యధికమంది కార్మికులు ఆధారపడి పనిచేస్తున్న చేనేత రంగాన్ని పాలకులు నిర్వీర్యం చేస్తూ పెట్టుబడిదారులకు పెద్దపీట వేస్తున్నారన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం చేనేతపై జీఎస్టీని తీసుకురావడంతో ఆ రంగం మరింత నిర్వీర్యమైందన్నారు. చేనేత కార్మికుల ఆకలి చావులు మరింత పెరిగాయన్నారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం 11వ రాష్ట్ర మహాసభలలో చేనేత రంగ పరిరక్షణకు ప్రభుత్వాలు సమగ్ర విధానాన్ని ప్రకటించాలని, చేనేతరంగంపై జీరో జీఎస్టీని ప్రకటించాలని, లేబర్ కోడ్‌లు రద్దుచేసి పనిగంటలను తగ్గించాలని, 'సర్వశిక్ష' ద్వారా పాఠశాల విద్యార్థులందరూ చేనేత దుస్తులు వాడుకునేటట్లు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని తీర్మానాలు చేయాలని ఆయన సూచించారు.

- జీఎస్టీని రెండు స్లాబులకు పరిమితం చేయడం వలన చేనేత కార్మికులకు,పేదలకు ఒరిగింది ఏమీ లేదన్నారు. 2014లో రాష్ట్రం విడిపోయిన తర్వాత అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి రాజధాని తప్ప రైతుల గోడు, చేనేత కార్మికుల గోడు పట్టలేదన్నారు. మహాసభల సందర్భంగా సత్తెనపల్లి పట్టణంలో చేనేత కార్మికులతో భారీ ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనలో చేనేత రంగ పరిరక్షణకై సమగ్ర విధానాన్ని ప్రకటించాలని. జీఎస్టీని రద్దు చేయాలని, ప్రతి చేనేత కార్మికునికి నేతను నేస్తం అమలు చేయాలని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును ఇవ్వాలని నినాదాలు చేశారు. సభలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, చేనేత కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రామనాథం పూర్ణచంద్రరావు, చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మన్నూరు భాస్కరయ్య, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామార్తి రాజు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి డోకిపర్తి రామారావులు మాట్లాడారు. అనంతరం జరిగిన ప్రతినిధుల మహాసభలో సంఘం ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ మూడు సంవత్సరాల కాలంలోని కార్యక్రమాల కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు.

వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలు తొలగించిన పోలీసులు

- దాచేపల్లి పోలీసుల తీరుపై వైఎస్సార్ సీపీ నేతల మండిపాటు
- నగర పంచాయతీ కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళన
- ఫ్లెక్సీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ



కమిషనర్ జి.వెంకటేశ్వర్లు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

దాచేపల్లి: పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలో వైఎస్సార్ సీపీకి చెందిన ఫ్లెక్సీలను సోమవారం పోలీసులు అకారణంగా తొలగించారు. ఎటువంటి అనుమతులు లేకుండా నగర పంచాయతీ నిండా టీడీపీ, జనసేన ఫ్లెక్సీలు ఉన్నప్పటికి వాటిజోలికి వెళ్లకుండా వైఎస్సార్ సీపీకి చెందిన ఫ్లెక్సీలను దాచేపల్లి సీఐ పి.భాస్కర్ దగ్గరుండి తొలగించటం వివాదస్పమైంది. సీఐ భాస్కర్ తీరుపై వైఎస్సార్ సీపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. నగర పంచాయతీ చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ పెద్దకుమారుడు రవికుమార్ జన్మదినోత్సవం సందర్భంగా వైఎస్సార్ సీపీ కార్యాకర్తలు, నాయకులు నగర పంచాయతీలోని ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. రవికుమార్‌కి అభినందనలు తెలియజేస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే ఏర్పాటు చేయడమే ఆలస్యం అన్నట్లుగా.. తొలగించేందుకు సీఐ భాస్కర్ రంగంలోకి దిగారు. దాచేపల్లి బస్టాండ్ సెంటర్, నారాయణపురం ఆర్‌అండ్‌బీ బంగ్లా సెంటర్, ముత్యాలంపాడు రోడ్డు సెంటర్‌లలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను యుద్ధప్రాతిపదికన తొలగింపజేశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు తొలుత నగర పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. అనంతరం కమిషనర్ జి.వెంకటేశ్వర్లుతో నాయకులు మాట్లాడారు.

- నగర పంచాయతీ మొత్తం అనధికారికంగా కూటమి నేతలు ఫ్లెక్సీలు భారీ ఎత్తున ఉన్నాయని, వాటిని తొలగించకుండా వైఎస్సార్ సీపీకి చెందిన ఫ్లెక్సీలు తొలగించటంపై కమిషనర్‌ని ప్రశ్నించారు. నగర పంచాయతీలో ఏ అధికారం ఉందని ఫ్లెక్సీలను పోలీసులు తొలగించారని, తక్షణమే తొలగించిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని వైస్ చైర్మన్ కొమెరబత్తిన విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడికి అభినందనలు తెలియజేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే తొలగించటం మంచి పద్ధతి కాదని, కమిషనర్ పచ్చ చొక్కా వేసుకుని ఉద్యోగం చేయాలని నాయకులు అన్నారు. తొలంగించిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేసే బాధ్యత తాను తీసుకుంటామనని, ఇకపై ఇటువంటి తొందరపాటు పనులు జరగవని కమిషనర్ వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు. ఆందోళన చేసిన వారిలో పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి, అధికార ప్రతినిధి షేక్ జాకీర్ హుస్సేన్, వైస్ ఎంపీపీ తండా అబ్దుల్‌సత్తార్, కౌన్సిలర్లు మందపాటి వీరారెడ్డి, ఈదా వెంకటరెడ్డి, నాగుబండి గురువులు, చాట్ల క్రాంతికుమార్, నాయకులు కుందురు తిరుపతిరెడ్డి, మునగా శ్రీనివాసరావు, కొలా జంపాలరెడ్డి, కొమ్ము బుజ్జి, జక్కా అశోక్, నాశం శ్రీనివాసరావు, బొడ్డు నాగేశ్వరరావు, కొండవీటి కొండలరావు, బొల్లంపల్లి మరియదాసు, కొర్రపాటి ఏర్రయ్య, వలి, నాగరాజు, జంగాల సింగరయ్య యాదవ్, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

గిరిజన శాఖ మంత్రి రాజీనామా చేయాలి

గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీనునాయక్



తహసీల్దార్ మొహమ్మద్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనునాయక్


చిలకలూరిపేట: గిరిజన గురుకుల పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించటంలో విఫలమైన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తన పదవికి రాజీనామా చేయాలని ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. గిరిజన పాఠశాలల్లో నెలకొన్న సమస్యలకు సంబంధించి గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ మొహమ్మద్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అల్లూరి జిల్లా చింతపల్లి మండలంలోని గిరిజన సంక్షేమం ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై లైంగిక దాడి ఎంతో బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై సంబంధిత అధికారులు సకాలంలో స్పందించకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో గిరిజన ఏకలవ్య బాలికల పాఠశాలలో ఆహారం తిని 40 మంది విద్యార్థులు చికిత్స పొందుతున్నారని, ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతుందన్నారు. ఈ సంఘటన ఇద్దరు విద్యార్థులు మృతి చెందటం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శమని విమర్శించారు. చనిపోయిన విద్యార్థినిల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం తగు న్యాయం చేయాలన్నారు. మరో పక్క చిలకలూరిపేట పట్టణ శివారులోని పురుషోత్తమపట్నంలో ఉన్న గిరిజన పాఠశాల నూతన భవనాలను కమ్మవారిపాలెం గ్రామం వద్ద 2.5 ఎకరాలు కేటాయించటం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి రూ. 4కోట్లతో ప్రణాళికలు రూపొందించినప్పటికీ నిర్మాణానికి మాత్రం నోచుకోవడంలేదని విమర్శించారు. ప్రస్తుతం ఉన్న గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు మరుగుదొడ్లు అధ్వానంగా ఉండి ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. తక్షణమే మరుగుదొడ్ల సమస్య పరిష్కరించాలని కోరారు. అఖిలభారత యువజన సమాఖ్య నాయకుడు బి.రాంబాబునాయక్, పాలపర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు 1620 మెట్రిక్ టన్నుల యూరియా



నాదెండ్ల: సాతులూరులోని రైల్వే ఎరువుల రేక్ పాయింట్‌ను నరసరావుపేట ఏడీఏ కేవీ శ్రీనివాసరావు పరిశీలించారు. పల్నాడు జిల్లాకు సీఐఎల్ యూరియా 1620 మెట్రిక్ టన్నులు కేటాయించినట్లు తెలిపారు. అనంతరం సాతులూరులోని ఆవాస్ గోడౌన్లు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కేటాయించిన ఎరువులు సొసైటీలకు ప్రైవేటు డీలర్లకు సరఫరా చేసి రైతులకు సక్రమంగా పంపిణీ అయ్యేలా చూడాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. ఆయనతో పాటూ ఏఓ టి.శ్రీలత, ఏఈఓ జీపీ శ్రీనివాసరావు ఉన్నారు.

ఏనుగుపాలెంలో యువకుడి హత్య



వినుకొండ: పల్నాడు జిల్లా వినుకొండ రూరల్ మండలం ఏనుగుపాలెం గ్రామంలో యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన గుంటూరు శివ (35)ను గుర్తుతెలియని వ్యక్తులు గ్రామ సమీప పొలాల్లో గడ్డపారతో పొడిచి హత్య చేసినట్లు సోమవారం గుర్తించారు. స్థానిక రైతులు ఇచ్చిన సమాచారంతో నరసరావుపేట డీఎస్పీ హనుమంతరావు, ఇన్‌చార్జి సీఐ బాలాజీ సంఘటనా ప్రాంతానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. శివ హత్యపై విచారణ చేస్తున్నామని, త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని డీఎస్పీ తెలిపారు. మృతుడికి భార్య సుధతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మృతుడు ఒంగోలు వాసిగా గుర్తింపు

చిలకలూరిపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణానికి చెందిన నంగనం రామకృష్ణ(44) కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తుంటాడు.

వ్యక్తిగత పనుల నిమిత్తం గుంటూరు వచ్చాడు. ఆదివారం రాత్రి 10.30 సమయంలో గుంటూరు నుంచి ఒంగోలుకు బైక్‌పై వెళ్తున్న క్రమంలో పల్నాడు జిల్లా నాదెండ్ల మండలంలోని కుప్పగంజి వాగు సమీపంలో ఆగి ఉన్న వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఘటనలో తీవ్ర గాయాలపాలైన రామకృష్ణను స్థానికులు చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

వృద్ధుడిని బలిగొన్న బైకు

మోతడక(తాడికొండ): ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన తాడికొండ మండలం మోతడక గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. మోతడక గ్రామానికి చెందిన కొమ్మినేని సాంబశివరావు (67) ఆదివారం సాయంత్రం సచివాలయం సెంటర్‌లో రోడ్డు దాటుతున్నాడు. అమరావతి వైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం వేగంగా అతడిని ఢీకొట్టింది. తలకు బలమైన గాయం కావడంతో వెంటనే జీజీహెచ్‌కు తరలించారు. అప్పటికే అతడు మరణించినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

పీజీఆర్ఎస్‌కు ఫిర్యాదుల వెల్లువ

అర్జీదారుల సమస్యలు ఆలకించిన జిల్లా ఎస్పీ కృష్ణారావు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు

నరసరావుపేట రూరల్: జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధిక సంఖ్యలో ఫిర్యాదులు వచ్చాయి. కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలతో పాటు మోసం తదితర సమస్యలపై 122 ఫిర్యాదులు అందాయి. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, అదనపు ఎస్పీ(అడ్మిన్) జేవి సంతోష్, అదనపు ఎస్పీ(క్రైమ్) లక్ష్మీపతిలు పీజీఆర్ఎస్‌లో పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు.

స్థలాన్ని ఆక్రమించి గుడి కట్టారు..

తన స్థలాన్ని ఆక్రమించి నిదానంపాటి మహాలక్ష్మీ అమ్మవారి గుడి నిర్మించారని చిలకలూరిపేటకు చెందిన ఝాన్సీరాణి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. పురుషోత్తమపట్టణం చాకలికాలనీలో ఆరు సెంట్ల స్థలం 1984లో కొనుగోలు చేసినట్టు ఝాన్సీరాణి తెలిపారు. కరోనా సమయంలో తన భర్త చనిపోయాడని, రెండు నెలల క్రితం ఆ స్థలం వద్దకు వెళ్లి చూడగా బాణావత్ కోటేశ్వరరావు నాయక్ అనే వ్యక్తి గుడిని నిర్మించి బోర్డును పెట్టారని తెలిపింది. దీనిపై కోటేశ్వరనాయక్‌ను ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పకుండా కులదూషణ కేసు పెడతామని బెదిరిస్తున్నాడని ఫిర్యాదు చేసింది.

ఉద్యోగం ఇప్పిస్తామని మోసం..

బయో మెడికల్ ఇంజినీరింగ్‌గా ఉద్యోగం ఇప్పిస్తానని రూ.6.60లక్షలు మోసానికి పాల్పడినట్టు సత్తెనపల్లి మండలం అబ్బూరుకు చెందిన బాధితుడు బాదరబోయిన తిరుపతిరావు పిర్యాదు చేసాడు. చిత్తూరుకు చెందిన బి.రమేష్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పడంతో రెండు ఖాతాల ద్వారా రూ.6.60లక్షలను చెల్లించినట్టు తెలిపాడు. ఉద్యోగం గురించి అడిగితే కాలయాపన చేయడంతో డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగినట్టు తెలిపాడు. యాక్సిస్ బ్యాంక్ చెక్కులు ఇచ్చిన రమేష్ డబ్బులు ఇవ్వకుండా మోసం చేసాడని ఫిర్యాదులు పేర్కొన్నాడు. న్యాయం చేసి నగదు ఇప్పించాలని కోరాడు.

నమ్మించి మోసం చేసాడు..

పరిచయం ఉన్న వ్యక్తి తనను నమ్మించి మోసం చేసినట్టు రొంపిచర్ల మండలం పరగటిచర్లకు చెందిన తిమ్మనపల్లి శివశంకర్ ఫిర్యాదు చేసాడు. నరసరావుపేటలోని బరంపేటకు చెందిన సిరంగి రవికాంత్‌తో కొంతకాలంగా పరిచయం ఉందని, తనకు సిబిల్ స్కోర్ తక్కువ ఉందని తన పేరుతో ఈఎంఐ రూపంలో బజాజ్ ఫైనాన్స్‌లో ఫోన్ తీసుకుంటానని చెప్పినట్టు తెలిపాడు. మొదట రూ.15వేలు ఫోన్ తీసుకుంటానని చెప్పి, మొబైల్ షాప్‌లో రూ.లక్ష విలువైన ఐఫోన్ తీసుకున్నాడని వివరించాడు. ఒక నెల ఈఎంఐ కట్టి తరువాత కట్టకపోవడంతో ఫైనాన్స్ సిబ్బంది తన ఇంటికి వచ్చి ఇబ్బందులు పెడుతున్నారని తెలిపాడు. దీనిపై రవికాంత్‌ను ప్రశ్నించగా దురుసుగా మాట్లాడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

కొండమోడు-పేరేచర్ల రహదారి నిర్మాణం వేగవంతం చేయండి

జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా



అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్

నరసరావుపేట: జిల్లాలో కొండమోడు-పేరేచర్ల మధ్య నిర్మిస్తున్న జాతీయ రహదారి 167ఏజీ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సోమవారం తన చాంబర్‌లో జాతీయ రహదారులు 167ఏజీ, 167ఏ నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించారు. పిడుగురాళ్ల - సత్తెనపల్లి - పేరేచర్ల రోడ్డు వెడల్పు తక్కువగా ఉండటంతో హైదరాబాద్ వెళ్లే వాహనాల రద్దీ ఇబ్బందిగా మారిందన్నారు. ప్రజల సౌకర్యార్థం రోడ్డు విస్తరణ పనులు ముందుగా ప్రారంభించి పూర్తిచేయాలన్నారు. నకరికల్లు - వాడరేవు జాతీయ రహదారి 167ఏ నిర్మాణం కోసం భూసేకరణకు రైతులకు ఆమోదయోగ్యమైన ధరను నిర్ణయిస్తామన్నారు. జేసీ సూరజ్ గనోరే, జాతీయ రహదారుల ఎక్జిక్యూటివ్ ఇంజినీర్ సంజీవ రాయుడు పాల్గొన్నారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోండి

కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్రజాసంఘాల ధర్నా



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నేతలు

నరసరావుపేట: వినుకొండ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములు, చుక్కల భూములను ఆక్రమించి వ్యాపారం చేస్తున్న వారిపై వెంటనే తగిన చర్యలు తీసుకొని ఆ భూములను తిరిగి స్వాధీనం చేసుకొని పేదలకు ఇళ్ల స్థలాలుగా పంపిణీ చేయాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులతో ధర్నా నిర్వహించి పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ కృతికా శుక్లాకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు మాట్లాడుతూ సర్వేనెంబర్ 50/5, 63/8లోని సుమారు 68 ఎకరాల ప్రభుత్వ భూములు, చుక్కల భూములను రెవెన్యూ యంత్రాంగంతో కుమ్మక్కై భూస్వాములు ఆక్రమించి భూ వ్యాపారం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ ఉన్నత ఉద్యోగులైన ఓ ఇద్దరు తమ కుటుంబ సభ్యులను బినామీలుగా పెట్టి పైన పేర్కొన్న సర్వే నంబర్లలోని 68 ఎకరాల ప్రభుత్వం దళితులకు ఇచ్చిన చుక్కల భూములుగా రికార్డుల్లో ఉన్న భూములను కొనుగోలు పేరుతో రికార్డులు సృష్టించుకుని అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి కబ్జాదారుల చేతుల్లో ఉన్న ఆ భూములను స్వాధీనం చేసుకొని పేదలకు ఇళ్ల స్థలాల కింద పంపిణీ చేయవలసిందిగా కలెక్టర్‌ను కోరామన్నారు. సీనియర్ నాయకులు రెడ్డిబోయిన ప్రసన్నకుమార్, పీడీఎం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రాంబాబు, సీనియర్ నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, కార్యదర్శి జి.రామకృష్ణ, గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు వి.కోట నాయక్ పాల్గొన్నారు.

సిఫార్సు బదిలీలు నిలిపివేయాలని డిమాండ్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వం సిఫార్సు బదిలీలు చేపట్టడం చట్టాన్ని ఉల్లంఘించడమేనని, తక్షణమే వాటిని నిలిపివేయాలని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవ లింగారావు, ఎండీ ఖాలీద్ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మంగళగిరి మండలం నిడమర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడిని అన్యాయంగా వేరొక పాఠశాలకు బదిలీ చేసి, ఆ స్థానంలో కృష్ణా జిల్లా నుంచి హెచ్ఎంను తీసుకురావడం గుంటూరు జిల్లాలోని ప్రధానోపాధ్యాయులకు అవమానమేనన్నారు. చట్టంలో విద్యాసంవత్సరం మధ్యలో ఎలాంటి బదిలీలు ఉండవని చెప్పిన ప్రభుత్వం గుంటూరు జిల్లాకు సంబంధం లేని హెచ్ఎంను తీసుకురావడం సరైనది కాదన్నారు. ఇలా ఆరుగురు ఉపాధ్యాయులు కేటగిరీ 1, 2 పాఠశాలల్లో విధుల్లో చేరినట్లు తెలుస్తోందని చెప్పారు. ప్రభుత్వ చర్యల కారణంగా రాజకీయ పలుకుబడి లేని సాధారణ ఉపాధ్యాయులను ఆందోళనకు గురి అవుతున్నారన్నారు. కౌన్సెలింగ్‌కు విరుద్ధంగా ఉన్న ఈ తరహా బదిలీలను తక్షణమే నిలుపుదల చేయాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

ఎస్ఐ అనుచిత ప్రవర్తనపై ఫిర్యాదు

ఏఎస్పీకి ఫిర్యాదుచేసిన పిడుగురాళ్ల మండలం కోనంగి గ్రామ మహిళలు



ఎస్ఐ అనిల్‌పై ఫిర్యాదు చేసేందుకు జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చిన మహిళలు

నరసరావుపేట రూరల్: బతుకమ్మ వేడుకల్లో తమను దుర్భాషలాడి, అనుచితంగా ప్రవర్తించిన పిడుగురాళ్ల రూరల్ ఎస్ఐ అనిల్‌పై చర్యలు తీసుకోవాలని పిడుగురాళ్ల మండలం కోనంకి గ్రామానికి చెందిన మహిళలు జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) జేవీ సంతోష్ కలిసి ఫిర్యాదు చేశారు. గత 30 సంవత్సరాలుగా గ్రామంలో బతుకమ్మను ఏర్పాటుచేసి పూజలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడాది కూడా బతుకమ్మను పూజించి ఈనెల 2వ తేదీన దసరా పండుగ రోజున గ్రామంలో నిమజ్జన ఊరేగింపు ఏర్పాటుచేసామని పేర్కొన్నారు. ఈ సమయంలో ఎస్ఐ అనిల్ గ్రామానికి చెరుకుని మైక్‌కు అనుమతి లేదని ఊరేగింపును నిలిపివేశాడని ఫిర్యాదులో తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా సాంప్రదాయంగా జరుపుకొనే వేడుకను అడ్డుకోవద్దని కోరినట్టు వివరించారు. తనకు రూ.20వేలు చెల్లించి ఊరేగింపు జరుపుకోమని ఎస్ఐ చెప్పడంతో, స్థానిక మహిళల నుంచి అప్పటికప్పుడు రూ.10వేలు వసూళ్లు చేసి రామాలయం సెంటర్‌లో ఎస్ఐకు అందజేసి ఇంతకంటే మేము ఇవ్వలేమని చెప్పినట్టు మహిళలు పేర్కొన్నారు. ఎస్ఐ అనుమతితో గ్రామంలో ఊరేగింపు ప్రారంభించినట్టు తెలపారు. రాత్రి 9గంటల సమయంలో జమ్ము చెట్టు సెంటర్‌కు చేరుకున్న ఊరేగింపును ఎస్ఐ అడ్డుకుని మిగిలిన రూ.10వేలు చెల్లించాలని డిమాండ్ చేశాడని ఫిర్యాదులో వివరించారు. రోజువారి పనులు చేసుకుని జీవించే వారమని అంతకన్నా ఇవ్వలేమని చెప్పినా ఎస్ఐ వినకుండా మహిళలను దుర్భాషలాడటంతో పాటు అసభ్యంగా ప్రవర్తించాడని తెలిపారు. ఎస్ఐ తీరుతో మహిళలు ఆయనను చుట్టుముట్టి ఆగ్రహం వ్యక్తం చేయడం జరిగిందన్నారు. తనకు డబ్బులు ఇవ్వకపోయినా, చెప్పినట్టు చేయకపోయినా కేసులు తప్పవని మాపై బెదిరింపులకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోలేదని తెలిపారు. మహిళల పట్ల అనాగకరికంగా వ్యవహరించిన ఎస్ఐ అనిల్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. జిల్లా అదనపు ఎస్పీని కలిసిన వారిలో పుణ్యాల అర్చన కుమారి, చలవాది లక్ష్మీ, పుణ్యాల విజయమ్మ తదితరులు ఉన్నారు.

సముద్ర స్నానానికి వచ్చి వివాహిత మృతి



ఊసుపల్లి శాంతి మృతదేహం

చినగంజాం: సముద్ర స్నానం చేసేందుకు వచ్చి వివాహిత మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని మోటుపల్లి సముద్ర తీరంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శీలం రమేష్ వివరాల మేరకు.. చీరాల వాడరేవు పరిధిలోని అడవి పల్లెపాలెం గ్రామానికి చెందిన ఊసుపల్లి శాంతి (25)కి ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన సలగల వినయ్ అనే పాస్టర్‌తో చర్చికి వెళ్లే క్రమంలో పరిచయం ఏర్పడింది. ఆమె గడచిన కొద్ది రోజులుగా పందిళ్లపల్లి పాతరెడ్డి పాలెం గ్రామానికి వచ్చి ఆమె సోదరి ఇంటి వద్ద ఉంటోంది. ఈ క్రమంలో ఆమె పాస్టర్ వినయ్‌తో కలిసి మోటుపల్లి సముద్ర తీరానికి స్నానం చేసేందుకు వచ్చింది. ఇద్దరు స్నానం చేసే క్రమంలో ఆమెను నీటిలో వదలి పెట్టి వినయ్ బయటకు వచ్చేశాడు. ఘటనను గమనించి స్థానికంగా ఉన్న మత్స్యకారులు ఆమెను ఒడ్డుకు తీసుకొని వచ్చి 108కి సమాచారం అందించారు. ఆమె ఆ పాటికే చనిపోయినట్లు గుర్తించారు. మృతురాలికి భర్త, ఇద్దరు సంతానం ఉన్నట్లు సమాచారం. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆమె బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. పాస్టర్ వినయ్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.